క్లుప్తంగా

అనారోగ్యంతో వీఆర్ఏ మృతి



మాలకొండయ్య పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ పుల్లారావు

పొన్నలూరు: మండలంలోని ముప్పాళ్ల వీఆర్ఏగా విధులు నిర్వహిస్తున్న ఉలవపాటి మాలకొండయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న మాలకొండయ్య ఇటీవల హాస్పిటల్‌లో చేరి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ పుల్లారావు, డిప్యూటీ తహసీల్దార్ స్రవంతి, వీఆర్ఓ రవి, పలు గ్రామాల వీఆర్ఏలు మాలకొండయ్య పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని తెలిపారు.

రేగులచిలకలో సర్వే ప్రారంభం



సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని రేగులచిలక రెవెన్యూలోని సర్వేనంబర్ 224కు సంబంధించి ఎంజాయ్‌మెంట్ సర్వే సోమవారం ప్రారంభించినట్లు తహసీల్దార్ మంజునాథరెడ్డి తెలిపారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మొదటిరోజు బెంగుళూరు, కడప, విజయవాడ (బికెవి) గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే 224 సర్వేనంబర్ భూములకు సంబంధించి సర్వే నిర్వహించినట్లు తెలిపారు. వారం రోజులపాటు జరిగే ఈ సర్వేకు రైతులు భూమికి సంబంధించిన యాజమాన్య పత్రాలు అందజేసి సర్వేకు సహకరించాలన్నారు.

90 మందికి కంటి పరీక్షలు

టంగుటూరు: రావూరి వినీల మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ శాఖ, శంకర కంటి ఆసుపత్రి గుంటూరు వారి సహకారంతో సోమవారం స్థానిక బ్రహ్మంగారి గుడి ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 90 మందికి కంటి పరీక్షలు చేసి వారిలో 51 మందికి ఆపరేషన్ అవసరమని నిర్ధారించారు. వారిని ఆస్పత్రి వాహనంలో గుంటూరు తరలించినట్లు ఫౌండేషన్ వైస్ చైర్మన్ రావూరి తిరుమల రాధాకృష్ణ తెలిపారు. ఫౌండేషన్ సభ్యులు గోపి సాయి కృష్ణ, బైసాని సుబ్బారావు, మౌలాలి, డాక్టర్లు రావూరి చంద్రశేఖర్, చేతన్, రవికాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలి



మాట్లాడుతున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

టంగుటూరు: పొగాకు రైతులు ప్రత్యామ్నాయ పంటలు వైపు మొగ్గు చూపాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు అన్నారు. బోర్డు పరిధిలోని అన్ని గ్రామాలకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పంట కాలానికి బ్యారన్‌కు 5.5 ఎకరాల సాగుకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. రైతులు అనుమతి మేరకే సాగు చేయాలన్నారు. కొత్తగా అనధికార బ్యారన్‌లు నిర్మించవద్దని సూచించారు. రైతులు పొగాకు బోర్డు, సీటీఆర్ఐ సిఫార్సు చేసిన అధిక దిగుబడినిచ్చే వంగడాలను సాగు చేయాలన్నారు. క్షేత్రాధికారి ఉపేంద్ర, ఐటీసీ మేనేజర్ పి.రాజశేఖర్, జీపీఐ మేనేజర్ ఉన్నం శ్రీనివాస్, పీఎస్ఎస్ మేనేజర్ ఆర్ల రామాంజనేయులు, పొగాకు బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

భైరవకోనలో వీసీ ప్రత్యేక పూజలు



భైరవకోన పూజల్లో పాల్గొన్న ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వీసీ డీవీఆర్ మూర్తి

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం భైరవకోనను సోమవారం ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డీవీఆర్ మూర్తి స్థానిక బెల్లంకొండ విద్యాసంస్థల సెక్రటరీ కరస్పాండెంట్ మద్దుల శ్రీనివాసులు, ఎస్‌వీజీసీ డైరెక్టర్ వి.కృష్ణమరాజులతో కలిసి సందర్శించారు. ఈసందర్భంగా అర్చకులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహింపచేశారు. అనంతరం జలపాతాన్ని సందర్శించారు. రత్నం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ యస్.వెంకటేష్, బెల్లంకొండ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.నారాయణ ఉన్నారు.

చెడ్డీ గ్యాంగ్ పట్ల అప్రమత్తంగా ఉండండి

సింగరాయకొండ: జిల్లాలో చెడ్డీ గ్యాంగ్ సంచరిస్తోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ సీహెచ్ హజరత్తయ్య అన్నారు. ఈ గ్యాంగ్ దొంగతనాలు, హత్యలు చేయడంలో సిద్ధహస్తులన్నారు. ఎవరైనా బయట ఊళ్లకు వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం ఇస్తే..ఆ ఇంటి పరిసరాల్లో నిఘా ఉంచుతామన్నారు. ఆర్థిక స్థోమత ఉన్న వారు ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

అడుగడుగునా గుంతలు..

గుప్పెట్లో ప్రాణాలు



కందుకూరు, పొన్నలూరు మధ్యలో ఓవీ రోడ్డుపై ఏర్పడిన గుంతలు



ముత్తరాసుపాలెం ఆంజనేయస్వామి గుడి సమీపంలో రూపమే కోల్పోయిన ఓవీ రోడ్డు

- అధ్వానంగా ఓవీ రోడ్డు
- రోడ్డు పొడవునా పెద్ద పెద్ద గుంతలు
- వర్షానికి మరింతగా దెబ్బతిన్న రోడ్డు
- తరుచూ ప్రమాదాలతో వాహనదారులు ఇక్కట్లు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

పొన్నలూరు:

కందుకూరు నుంచి పొన్నలూరు మీదగా కనిగిరి వెళ్లే ఓవీ రహదారి పరిస్థితి అధ్వానంగా ఉంది. ఈ రహదారిపై ప్రయాణమంటే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. సుమారుగా 10 ఏళ్ల క్రితం కందుకూరు నుంచి పొన్నలూరు మండల పరిధిలోని ముత్తరాసుపాలెం వరకు సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించారు. అయితే ఈ రోడ్డును తూతూమంత్రంగా నాణ్యత లేకుండా నిర్మించడంతో కొన్నేళ్లకే అడుగడుగునా గుంతలు ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. ముఖ్యంగా రోడ్డు మధ్యలో తారు, కంకర లేచిపోయి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు వర్షం పడినప్పుడు, రాత్రి సమయాల్లో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. వేగంగా వచ్చే భారీ వాహనాలు, ద్విచక్ర వాహనాలు ఒక్కసారిగా బ్రేకులు వేసి గుంతలో దిగడంతో అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి.

ముత్తరాసుపాలెం దగ్గర అధ్వానం....

కందుకూరు నుంచి ముత్తరాసుపాలెం వరకు ఓవీ రోడ్డు సుమారుగా 8 కిలోమీటర్ల దూరం ఉంటుంది. దారి పొడవునా రోడ్డు మధ్యలో మూడు, నాలుగు అడుగుల వెడల్పుతో అడుగు మేర లోతుతో గుంతలు ఏర్పడాయి. అలాగే ముత్తరాసుపాలెం సమీపంలో మూడు చోట్ల రోడ్డు పూర్తిగా దెబ్బతిని భారీగా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో రోడ్డు సరిగా లేకపోవడంతో తరుచూ ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతూ ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఇటీవల ఒకే రోజు ముగ్గురు ద్విచక్ర వాహనదారులు ముత్తరాసుపాలెం సమీపంలో ఓవీ రోడ్డుపై గుంతలు ఉన్న సంగతి తెలియక వేగంగా వచ్చి ప్రమాదానికి గురయ్యారు. అలాగే ఎదురుగా వాహనం రావడంతో సైడ్ దిగిన కూలీల ఆటో రోడ్డు మార్జిన్ సరిగా లేకపోవడంతో అదుపుతప్పి పడిపోయింది. ఇలా తరుచూ ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయి.



పొన్నలూరు, ముత్తరాసుపాలెం మధ్య పూర్తిగా తారు, కంకర లేచిపోయి అధ్వానంగా రోడ్డు

పట్టించుకోని పాలకులు, అధికారులు...

ఓవీ రహదారి కందుకూరు, కొండపి, కనిగిరి నియోజకవర్గాల పరిధిలో ఉండటంతో ప్రతి రోజు ద్విచక్ర వాహనాలతో పాటు లారీలు, టిప్పర్లు వంటి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే గత నాలుగు నెలలుగా ఓవీ రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడి, సైడ్ మార్జిన్లు అధ్వానంగా ఉన్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు చూస్తు ఈ రహదారిపై వెళ్లుతున్నారే తప్ప ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. గత పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఓవీ రోడ్డు మరింతగా దెబ్బతిని రూపం కోల్పోయింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

అమరవీరుల సేవలు చిరస్మరణీయం



సింగరాయకొండ: కందుకూరు రోడ్డు సెంటర్‌లో పోలీసుల మానవహారం



పామూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్సై, నాయకులు, సిబ్బంది

సింగరాయకొండ: పోలీసు అమరవీరులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఎస్సై బి. మహేంద్ర అన్నారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి పాకల రోడ్డు వరకు, అక్కడి నుంచి కందుకూరు రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించి విద్యార్థినులతో మానవహారంగా ఏర్పడ్డారు. ఎస్సై బి. మహేంద్ర మాట్లాడుతూ పోలీసుల త్యాగాల కారణంగానే మనమంతా ప్రశాంతంగా జీవిస్తున్నామన్నారు. టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు, ఎస్సై వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పామూరు: వృత్తే దైవంగా భావించి విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీస్ అమరవీరుల సేవలు చిరస్మరణీయమని పామూరు, వెలిగండ్ల ఎస్సైలు టి.కిషోర్‌బాబు, మధుసూదన్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి పామూరులోని ప్రధాన వీధుల్లో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పౌరుడు యూనిఫాం లేని పోలీస్ అని, ఎక్కడైనా అన్యాయం జరుగుతుంటే పోలీసుల దృష్టికి తేవాలన్నారు. ఏఎస్సై ముల్లా, యారవ శ్రీనివాసులు, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, ఉప్పలపాటి హరిబాబు, ఆకుపాటి వెంకటేష్, జెడ్పీటీసీ మాజీ సభ్యులు హుసేన్‌రావు, పందిటి హరీష్, మెంటా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కొండపి: పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్సై ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమరవీరుల త్యాగాలను గుర్తు చేశారు. తొలుత విద్యార్థులతో కలిసి పోలీస్‌స్టేషన్ నుంచి తహసీల్దార్ కార్యాలయంవరకు ర్యాలీ నిర్వహించి ఎన్‌టీఆర్ బొమ్మ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. మర్రిపూడి ఎస్సై రమేష్‌బాబు, పొన్నలూరు ఎస్సై కె.అనూక్, విద్యార్థులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: ప్రజాస్వామ్య, సమాజ పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. పోలీస్ అమర వీరుల దినోత్సవం పురస్కరించుకుని సోమవారం జరిగిన సభలో ఎమ్మెల్యే పాల్గొని, శాంతిమయ భావిభారతం కోసం విలువైన తమ ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు. తొలుత పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించారు. పామూరు బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పడగా సీఐ ఎస్‌కే ఖాజావలి మాట్లాడారు. ఎస్సైలు టి.శ్రీరాం, మాధవరావు, పోలీసు సిబ్బంది, ఎన్‌సీసీ విద్యార్థులు, విశ్రాంత ఎంపీడీఓ జీవీబీ మల్లికార్జునరావు, పల్లా కోటి రత్నం, తమ్మినేని శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.



కొండపిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్సైలు, సిబ్బంది



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

పొంగిపొర్లుతున్న వాగులు



శింగరబొట్లపాలెం వద్ద నీట మునిగిన ఉలవ పంట



ఉమ్మనపల్లిలో కుంటలు తలపిస్తోన్న పొగనాట్ల పొలాలు

- మండలంలో భారీ వర్షం

హనుమంతునిపాడు: మండలంలో సోమవారం కుంభవృష్టి వర్షం కురిసింది. మండల పరిధిలోని హనుమంతునిపాడు, వేములపాడు, ఉమ్మనపల్లి, కొత్తూరు, నందవనం, చిన్న ఉమ్మనపల్లి, ఉసుల్లపల్లి, గమళ్లపాలెం, అగ్రహారం వాలిచర్ల, తిమ్మారెడ్డిపల్లి, మొరవారిపల్లి, కొండారెడ్డిపల్లి గ్రామాల్లో కుంభవృష్టి వర్షం కురిసింది. దీంతో పొలాల్లో భారీగా వర్షంనీరు నిలిచింది. పొగాకు, మినుము, అలసంత, మిరప తోటలు సాగు చేసిన పొలాలు నీటమునిగాయి. ఉమ్మపల్లి వద్ద ఉన్న కొండవాగు, లోతువాగు పొంగి పొర్లుతున్నాయి. చిన్నమ్మనపల్లి, ఉసులళ్లపల్లి, ఉమ్మపల్లి గ్రామాల్లోని ఇళ్లలోకి మోకాటి లోతు నీరు చేరింది. దీంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో బీమవరపు కాశయ్య పేరమ్మ ఇంట్లోకి నీరు చేరడంతో 30 మందు బస్తాలు తడిసిపోయాయని బాధితులు వాపోయారు. భారీవర్షానికి వాగులు, వంకలు పొర్లడంతో ఇళ్లలోకి వర్షంనీరు చేరింది.

పొన్నలూరు: మండలంలో సోమవారం ఓ మోస్తారు వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లోని రోడ్లు జలమయం కావడంతో పాటు పంట పొలాలు, వాగులు, కుంటల్లోకి వర్షం నీరు చేరాయి. అలాగే ముత్తరాసుపాలెం, వెల్లటూరు, శింగరబొట్లపాలెం, ముప్పాళ్ల, పొన్నలూరు, నాగిరెడ్డిపాలెం, పైరెడ్డిపాలెం గ్రామాల్లో సాగు చేసిన మినుము, ఉలవ, జనుము, సజ్జ, మిరప పంట పొలాల్లో వర్షం నీళ్లు చేరి లేత మినుము, ఉలవ వంటి పంటలు నీట మునిగాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షం ముదురు మెట్ట పైర్లకు ఉపయోగపడినా, పొగాకు నారుమళ్లు మాత్రం కొంతమేర దెబ్బతిన్నాయి. మండలంలో 23 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

నారాయణస్వామి ఆదాయం రూ.1.01 లక్షలు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ..1,01,524 ఆదాయం వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకంద్వారా రూ.41,800, లడ్డుప్రసాదాల అమ్మకం ద్వారా రూ.22,760, ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.25,948, ఇతర విరాళాలకింద రూ.11,016 వచ్చినట్లు వారు తెలిపారు. అన్నదాన పథకానికి పామూరు మండలం చిలంకూరుకు చెందిన ఎస్. వెంకటరమణ, మాధురి దంపతులు రూ.11,116, సీఎస్‌పురం మండలం జినుగువారిపల్లె గ్రామానికి చెందిన ఆవుల పెదఓబయ్య రూ.10,116 విరాళంగా ఇచ్చారన్నారు.

కేజీబీవీలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు

వెలిగండ్ల(కనిగిరి రూరల్): విద్యార్థినులు శారీరక పరిశుభ్రత పాటించాలని డాక్టర్ పి.మౌనిక అన్నారు. స్థానిక కేజీబీవీలో విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మౌనిక మాట్లాడుతూ విద్యార్థినులు ప్రతిరోజూ వ్యాయామం చేయాలన్నారు. మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పాఠశాలలోని 80 మంది విద్యార్థినీలకు వైద్య పరీక్షలు చేశారు. పాఠశాల ప్రత్యేకాధికారి ఎస్ సుశీల, ఏఎన్ఎంలు టి.అపర్ణ, రూత్‌కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన



వెంకటాపురంలో కందిపంటను పరిశీలిస్తున్న ఏఓలు రాధ, శేషమ్మ

సీఎస్‌పురం(పామూరు): రైతులు వ్యవసాయ, ఉద్యానవన పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కలిగి సాగులో అమలు చేయాలని ఏఓ కంచం రాధ, డీఆర్‌సీ ఏఓ వీవీ శేషమ్మ అన్నారు. మండలంలోని రేగులచిలక రైతుసేవాకేంద్రంలో సోమవారం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కేవివై) పథకం కింద 2024–25 రైతులకు వ్యవసాయ, ఉద్యానవన పంటల్లో చేపట్టవలసిన మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమం నిర్వహించారు

పామూరు: రైతులు సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయాధికారి కంచం రాధ, డీఆర్‌సీ ఏఓ వీవీ శేషమ్మ అన్నారు. మండలంలోని దూబగుంట్ల రైతుసేవాకేంద్రం పరిదిలోని వెంకటాపురంలో సోమవారం జిల్లా వనరుల కేంద్రం ఒంగోలు ఆధ్వర్యంలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద 2024–25రైతులకు వ్యవసాయ, ఉద్యానవన పంటల్లో చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. వీఏఏలు అవినాష్, చిరంజీవి, ఎఫ్‌పీఓసీఈఓ ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న డీఆర్‌సీ ఏఓ శేషమ్మ

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



పోస్టుకార్డులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నేతలు

మర్రిపూడి: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో టీడీపీ ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ పార్టీ కనిగిరి ఇన్‌చార్జి దేవరపల్లి సుబ్బారెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా చంద్రబాబు మహిళల ఓట్లతో గద్దెనెక్కి ఇంత వరకు ఉచిత బస్సు ఊసే లేదన్నారు. ప్రధాన కూడలి, బస్టాండ్, ఆర్‌టీసీ బస్సుల్లో ప్రయాణికులకు పోస్టుకార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో షేక్ మస్తాన్, ఎస్‌కే పీరా, బాలసాని కోటేశ్వరరావు, షేక్ హజరత్, సంగటి మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



మెప్మా అర్బన్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: మహిళలు వ్యాపార రంగంలో అభివృద్ధి చెందాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక పులి వెంకటరెడ్డి పార్క్ వద్ద సోమవారం మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన అర్బన్ మార్కెట్ సెంటర్‌ను చైర్మన్ గఫార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ మహిళలు ఇళ్ల వద్ద తయారు చేసిన ఉత్పత్తులను, నాణ్యమైన ఉత్పత్తులను తమ్మడమే కాకుండా చాలా తక్కువ ధరకు విక్రయిస్తున్నారని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది.. అర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. కమ్యూనిటీ ఆర్గనైజర్ రమణమ్మ, సీఎల్‌ఆర్‌పీ దీప్తి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసులరెడ్డి, ఆర్‌పీలు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్ర

కనిగిరి రూరల్: ప్రజా సమస్య పరిష్కారానికే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ పందిటి మోహన్ మాట్లాడుతూ సుమారు 700 పైగా విద్యార్థులున్న ఆదర్శ పాఠశాలకు మౌలిక వసతుల కల్పించాలన్నారు. కనిగిరి పట్టణంతో పాటు, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 207 మంది అర్జీలు అందచేశారు. మున్సిపాలిటీలోని వివిధ సమస్యలపై 32 వినతులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. తహసీల్దార్ అశోక్‌కుమార్ రెడ్డి, ఎంపీడీఓ హనుమంతరావు, కమిషనర్ డానియల్ జోసఫ్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, ఏడీఏ ఈ వెంకటరమణ, ఫారెస్ట్ రేంజర్ ఉమామహేశ్వరరెడ్డి, విద్యుత్ ఏడీఈ ఉమాకాంత్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో లేని అధికారులపై, సమయపాలన పాటించని అధికారులపై, విధి నిర్వహణలో అలసత్వం వసిస్తే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీడీఓ ఎం.రంగసుబ్బరాయుడు, డిప్యూటీ తహసీల్దార్ కె.కిషోర్‌రెడ్డి, డీల్‌ఓ నరసిహారెడ్డి, ఫారెస్టు రేంజర్ ఉమామహేశ్వరెడ్డి, ఎస్సై మాధవరావు, డిప్యూటీ డీఈఓ చంద్రమౌళేశ్వరావు, నేతలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న తహసిల్దార్

కొండపి: మండలంలోని మూగచింతల ఎంపీయూపీఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దార్ మురళి పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం నాణ్యత లేకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహించి నాణ్యమైన భోజనాన్ని పిల్లలకు అందించాలని ఆదేశాలు ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం మెనూ సక్రమంగా ఇస్తున్నారా లేదా వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయంలో సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మీకోసంలో వచ్చిన వివాదాస్పద భూమిని పరిశీలించారు. కార్యక్రమంలో సర్వేయర్ ఫయాజ్, వీఆర్వో మాధవి, సిబ్బంది పాల్గొన్నారు

సిబ్బంది సమయపాలన పాటించాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామాంజనేయులు

కొండపి: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని మండల అభివృద్ధి అధికారి బి. రామాంజనేయులు అన్నారు. స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో సోమవారం సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి సచివాలయం అన్ని సర్వీస్లలో ముందంజలో ఉండాలన్నారు. అటెండెన్స్ రిజిస్టర్, సర్వీస్ రిజిస్టర్లు సక్రమంగా ఉండాలన్నారు. అధికారులు తనిఖీలకు వచ్చిన సందర్భంలో ఎటువంటి లోపాలు కనిపించినా సిబ్బందిపై శాఖపర చర్యలు తీసుకుంటామన్నారు. హౌసింగ్ ప్రోగ్రాం ద్వారా చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయించాలని, జేజేఎం స్కీం ద్వారా చేపట్టిన పనులు కూడా త్వరగా పూర్తి చేయాలని ఆయన సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఏఓ రామకృష్ణ, ఈఓపీఆర్డీ అంజలీదేవి, అన్ని సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులను ఎక్కించుకోలేదని బస్సు అడ్డగింత

వెలిగండ్ల(కనిగిరి రూరల్): స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థులను బస్సు ఎక్కించుకోలేదని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాఘవాచారి బస్సును అడ్డుకున్నారు. వివరాల్లోకి కంకణంపాడు, పాపిరెడ్డిపల్లి, అగ్రహారం గ్రామాల నుంచి పాఠశాలకు వచ్చి వెళ్లేందుకు బస్సును ఏర్పాటు చేశారు. అలాగే రామగోపాలపురం, రామలింగాపురం గ్రామాల నుంచి పాఠశాలకు వచ్చి, వెళ్లేందుకు బస్సును ఏర్పాటు చేశారు. ఆ గ్రామాలకు సుమారు 40 మంది విద్యార్థులు పాఠశాలకు వెళ్తున్నారు. సోమవారం అగ్రహారం బస్సు పాఠశాల వద్ద ఆపి విద్యార్థులను ఎక్కించుకుని వెళ్లింది. కానీ పూలికుంట్ల బస్సు పాఠశాల వద్ద బస్సు ఆపకుండా వెళ్లిపోయింది. విద్యార్థులు విషయాన్ని పాఠశాల హెచ్ఎం రాఘవాచారికి తెలియచేశారు. వెంటనే హెచ్ఎం, పీఈటీలు బస్టాండ్‌లో ఉన్న బస్సును అడ్డగించి విద్యార్థులను ఎక్కించుకుని వెళ్లే వరకు బస్సును అడ్డగించారు. పాఠశాల నుంచి విద్యార్థులు నడుచుకొని వచ్చి బస్సు ఎక్కారు. హెచ్ఎం రాఘవాచారిని బస్టాండ్‌లో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.